




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :162 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 16 ఫిబ్రవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :162 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 16 FEBRUARY 2025 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*


# నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం

- కందుకూరులో మెటీరియల్ రికవరీ సెంటర్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- నెల్లూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన
- కందుకూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- దూబగుంట గ్రామస్తులతో ముఖాముఖి



**కందుకూరు పెన్ పవర్ :** ఏపీని స్వచ్ఛాంధ్రగా చేయాలని సంకల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరులో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు.“పట్టణాల్లో 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. అక్టోబరు 2 నాటికి చెత్త తొలగించే బాధ్యతను మున్సిపల్‌శాఖకు అప్పగించాం. పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు నెలలో ఒకరోజు కేటాయించాలి. ప్రజలు మంచిగా ఆలోచిస్తే రాష్ట్రానికి తిరుగులేదు. చెత్తను పునర్వినియోగం చేసి.. సంపద సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 64 లక్షల మందికి పింఛన్ ఇస్తున్నాం. ఇబ్బందుల్లో ఉన్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. సంపద సృష్టిస్తేనే అభివృద్ధి జరుగుతుంది. నేరస్థుల పట్ల కఠినంగా ఉంటాం. వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వదిలిపెట్టం” అని చంద్రబాబు హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు నేడు నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. కందుకూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ రికవరీ సెంటర్ ప్రారంభించారు. అనంతరం కందుకూరు నియోజకవర్గం దూబగుంట గ్రామస్తులతో చంద్రబాబు ముఖాముఖి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెత్త నుంచి సంపద సృష్టించేలా ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

గ్రామాల్లో సర్పంచి ప్రథమ పౌరుడు అని, పంచాయతీ నిధులతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత సర్పంచిలదే అని చంద్రబాబు అన్నారు. ఇకపై అన్ని గ్రామాలకు ర్యాంకులు ఇస్తామని, బాగా పనిచేసే సర్పంచిలను సత్కరిస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి నారాయణకు ఓ టార్గెట్ ఇచ్చానని, ఈ ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి ఏ పట్టణంలోనూ నూటికి నూరు శాతం చెత్త కనిపించకుండా ఉండాలని మున్సిపల్ శాఖకు బాధ్యత అప్పగించానని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, చెత్తపై కూడా పన్నేశారని విమర్శించారు.

## షష్ట షణ్ముఖ ఆలయ యాత్ర పూర్తి చేసుకున్న పవన్ కల్యాణ్



- దక్షిణ భారతదేశంలో పవన్ కల్యాణ్ ఆధ్యాత్మిక పర్యటన
- 6 సుప్రసిద్ధ ఆలయాల సందర్శన
- తిరుత్తణి ఆలయ సందర్శనతో పూర్తయిన పవన్ యాత్ర

వివరాలు 2లో..

## 1994లోనే మోదీ కులాన్ని బీసీలో చేర్చారు



- నరేంద్ర మోదీ కులంపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు... స్పందించిన కిషన్ రెడ్డి
- అప్పుడు కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉందని వెల్లడి
- రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని విమర్శ

వివరాలు 2లో..

## తప్పు చేసిన వైసీపీ నేతలు తప్పించుకోలేరు

- వల్లభనేని వంశీ అరెస్ట్ పై మంత్రి నారా లోకేశ్ స్పందన
- ఇటీవల వల్లభనేని వంశీ అరెస్ట్
- దళితుడ్ని కిడ్నాప్ చేసినందుకు వంశీని అరెస్ట్ చేశారన్న లోకేశ్




**పెన్ పవర్ డెస్క్:**గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అంశంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. దళితుడిని కిడ్నాప్ చేసినందుకు వల్లభనేని వంశీ జైలుకెళ్లారని స్పష్టం చేశారు. వంశీపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. తప్పు చేసిన వైసీపీ నేతలు శిక్షలు తప్పించుకోలేరని లోకేశ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ అరాచక పాలనను అందరూ చూశారని, ప్రజా సమస్యలపై పోరాడిన

వివరాలు 2లో..

## అన్నదాతలపై చంద్రబాబు పగ పెంచుకున్నారు


- కూటమి పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న కాకాణి
- రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని మండిపాటు
- మిర్చి రైతులు రూ. 6 వేల కోట్ల మేర నష్టపోతున్నారని ఆవేదన



**పెన్ పవర్ డెస్క్:**కూటమి పాలనలో రైతులు అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. రైతులను దళారులు దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందా? అని ప్రశ్నించారు. అన్నదాతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు పగ పెంచుకున్నారని అన్నారు. గతంలో 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు 54 ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేశారని దుయ్యబట్టారు.

వివరాలు 2లో..

## రష్యా హ్యాండిచ్చింది.. ఆర్మీని రంగంలోకి దించే సమయం ఆసన్నమైంది



**పెన్ పవర్ డెస్క్:**రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగుస్తుందనుకునే లోపే మళ్లీ రెండు దేశాల మధ్య వేడి రాజుకుంటుంది. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని నివారిస్తానని యూఎస్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత ట్రంప్ ప్రకటించాడు. అయినా ఆ వైపుగా చర్యలు తీసుకుంటున్నన పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తమకు రష్యా హ్యాండిచ్చిందని.. అమెరికా సహాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని.. ఇక యూరోపియన్ ఆర్మీని రంగంలోకి దింపే సమయం ఆసన్నమైందని ఉక్రెయిన్

వివరాలు 2లో..

## ఫంక్షన్ లో పేలిన హైడ్రోజన్ బెలూన్స్.. మంత్రికి తీవ్ర గాయాలు

**పెన్ పవర్ డెస్క్:**పర్యాటక శాఖకు సంబంధిం చిన ఓ కార్యక్రమం లో నేపాల్ ఉప ప్రధాని, మేయర్ గాయాల పాలయ్యారు. హైడ్రోజన్ బెలూన్స్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరికి గాయాలు అయ్యా యి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఉప ప్రధాని, మేయర్ ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అధికారుల వివరాల ప్రకారం..

వివరాలు 2లో..



## వైకాపా నేత వల్లభనేని వంశీ ఫోన్ ఎక్కడ..?

### కిడ్నాప్ కేసులో అదే కీలకం

- వల్లభనేని వంశీ కేసులో దర్యాప్తు ముమ్మరం... హైదరాబాద్ లోని నివాసంలో సోదాలు
- విజయవాడ నుంచి హైదరాబాద్ కు వచ్చిన రెండు పోలీసు బృందాలు
- ‘మై హెూం భుజా’లోని వంశీ నివాసంలో సోదాలు
- వంశీ మొబైల్ లో కీలక ఆధారాలు ఉన్నాయని భావిస్తున్న పోలీసులు



**పెన్ పవర్ డెస్క్:**గన్నవరం తెదేపా కార్యాలయంలో పనిచేసిన సత్యవర్ధన్‌ను అపహరించి దాడి చేసిన కేసులో దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్ రాయదుర్గంలోని వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంట్లో ఏపీ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి వంశీ ఫోన్‌పై పోలీసులు దృష్టి సారించారు. దీనిని స్వాధీనం చేసుకుంటే కేసుకు సంబంధించిన కీలకమైన ఆధారాలు లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వివరాలు 2లో..

## ఒక బీసీ ప్రధానిగా రాణిస్తుంటే అగ్రవర్ణాలు జీర్ణించుకోలేకపోతున్నాయి

### రేవంత్ రెడ్డిపై ఆర్.కృష్ణయ్య ఆగ్రహం



- మోదీ కన్వర్టెడ్ బీసీ అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఆర్.కృష్ణయ్య
- రిజర్వేషన్లను పక్కదారి పట్టించేందుకే మోదీ కులాన్ని తెరపైకి తెచ్చారన్న ఎంపీ
- మోదీ కులం గురించి మాట్లాడినందుకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్

వివరాలు 2లో..

## హామీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు

- ఏపీలో కూటమి ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేస్తోందని వెల్లడి
- బటన్ నొక్కి హామీలు అమలు చేశానంటున్న జగన్ కు 11 సీట్లే ఎందుకు వచ్చాయంటూ ప్రశ్న
- ఏపీ, ఢిల్లీలో ప్రజా తీర్పులను ఓసారి గమనించాలని హితవు



వివరాలు 2లో..

## రోజా దగ్గర బంధువు అయిన మహిళతో కిరణ్ రాయల్ కు అక్రమ సంబంధం ఉంది

- అవసరానికి వాడుకుని ఆమెపై దాడి చేశాడన్న లక్ష్మి
- అభినయ్ రెడ్డితో తనకు అక్రమ సంబంధం ఉందని చెప్పాడని మండిపాటు
- మార్ఫింగ్ కేసులో కిరణ్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**జనసేన నేత కిరణ్ రాయల్ పై లక్ష్మిరెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా దగ్గర బంధువైన మహిళతో కిరణ్ కు అక్రమ సంబంధం ఉందని ఆమె అన్నారు. గతంలో రోజాను తిట్టిన కేసులో కిరణ్ అరెస్ట్ అయ్యాడని... కానీ, రాత్రికి

వివరాలు 2లో..

## ఇద్దరూ కలిసి రాష్ట్ర రైతులను నిండా ముంచారు



- రైతుల ఆత్మహత్యల్లో ఏపీది మూడోస్థానం అని షర్మిల వ్యాఖ్యలు
- రైతులు గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్నారని వెల్లడి
- చంద్రబాబు, జగన్ ధరల స్థిరీకరణ నిధి పేరిట మోసం చేశారని విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:**“లక్షల్లో అప్పులు... రోజుకో ఆత్మహత్య... రైతుల బలవన్మరణాల్లో మూడో స్థానం... ఇదీ మన రాష్ట్రంలో రైతుల దీనస్థితి” అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రభుత్వాలు మారినా రైతుల తలరాతలు మాత్రం మారడంలేదని విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రం అన్నపూర్ణగా పేరొందిందని... పంట దిగుబడుల్లో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన రైతులు ప్రస్తుతం గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్నారని షర్మిల విచారం వ్యక్తం చేశారు. “గత పదేళ్లుగా రైతులకు ప్రభుత్వాలు మాయమాటలు చెబుతూనే ఉన్నాయి. చంద్రబాబు మొదటి ఐదేళ్లు ఏడాదికి రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అని మాట తప్పారు. ఆ తర్వాత జగన్ ఏడాదికి రూ.3 వేల కోట్లతో నిధి అని మోసం చేశారు. ఇద్దరూ కలిసి రాష్ట్ర రైతులను నిండా ముంచారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వాణిజ్య యుద్ధం తప్పదా....

అమెరికా కొత్త అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో, చైనాపై సుంకాలు విధించడంతో ఆయా దేశాలు దీటుగా స్పందిస్తున్నాయికెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం, చైనాపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు.దీంతో కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో అమెరికా వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా సుంకాలకు సిద్ధంగా ఉన్నామని ట్రూడో చెప్పారు.మరోవైపు మెక్సికో, చైనా కూడా అమెరికా ప్రభుత్వ నిర్ణయానికి దీటుగా అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించాయి.వ్యవస్థ, ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ట్రూడో అభిప్రాయపడ్డారుకెనడాకు సంబంధించిన చాలా వస్తువులపై 25 శాతం సుంకం విధించనున్నట్లు అమెరికా ధృవీకరించింది. ఇంధనంపై 10 శాతం సుంకం కూడా విధిస్తున్నారు, ఫిబ్రవరి 4 నుంచి ఇవి అమలులోకి రానున్నాయి.కెనడా, మెక్సికో సరిహద్దుల నుంచి అమెరికాకు ఫెంటానిల్ డ్రగ్ వస్తోందని ట్రంప్ పదే పదే ఆరోపిస్తున్నారు.ఫెంటానిల్ కారణంగా అమెరికా ఈ నిర్ణయం తీసుకుందా? అని విలేఖరులు ప్రశ్నించగా ట్రూడో స్పందిస్తూ.. అమెరికా–కెనడా సరిహద్దు 'ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన, బలమైన వాటిలో ఒకటి' అన్నారు.కెనడా, మెక్సికో, చైనానుంచి అమెరికాకు దిగుమతయ్యే అన్ని రకాల వస్తువులపై సుంకాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ద్వారా కొత్త రకం వాణిజ్య యుద్ధానికి అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ తెరతీశారు. ఇప్పటికి సుంకాల పెంపు ఈ మూడు దేశాలకే పరిమితమైనా, రాగల కాలంలో భారత్‌తోపాటు మరికొన్ని దేశాలకూ వర్తింపజేసే ప్రమాదం కనబడుతోంది. అధ్యక్షపదవిలోకి వచ్చీరాగానే కొలంబియాపై సుంకాల మోత మోగించిన ట్రంప్, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు చిరకాలంగా తమతో వాణిజ్య భాగస్వాములుగా కొనసాగుతున్న మెక్సికో అండ్ కో పై ముందూవెనకా ఆలోచించకుండా సుంకాలు విధించడంతో అమెరికా వాణిజ్య విధానం విమర్శలకు గురవుతోంది. సుంకాల విధింపునకు ట్రంప్ చెబుతున్న కారణాలు వాణిజ్యానికి సంబంధం లేనివే కావడం గమనార్హం.కెనడా, మెక్సికో దేశాలు అక్రమ వలసలను అరికట్టటం లేదని, నిషేధిత ఫెంటానిల్ మాదకద్రవ్యం అమెరికాలోకి అక్రమంగా తరలిస్తున్న ముఠాలకు చైనా ముకుతాడు వేయడం లేదన్నవి ట్రంప్ చెబుతున్న కారణాలు. కెనడా, మెక్సికోలు అమెరికాకు దీర్ఘకాలిక మిత్రదేశాలు మాత్రమే కాదు, అమెరికాకు జరిగే ఎగుమతుల్లో చైనా తర్వాత ఈ రెండింటిదే సింహభాగం. ఈ దేశాలనుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం చొప్పున సుంకాలు విధించిన ట్రంప్, చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు వడ్డించారు. పైగా, సుంకాల విధింపునకు జాతీయ ఆర్థిక అత్యయిక స్థితిని విధించడం గమనార్హం. అమెరికాకు అక్రమంగా వలస వచ్చినవారి వల్ల స్వదేశీయుల ప్రయోజనాలు దెబ్బతింటున్న మాట వాస్తవం. అలాగే చైనానుంచి అక్రమ మార్గంలో వస్తున్న ఫెంటానిల్ కారణంగా అమెరికన్ యువత ప్రాణాలమీదకు తెచ్చుకుంటోందన్న ఆయన ఆక్రోశం కూడా అర్థం చేసుకోదగినదే. అయితే, చర్చల ద్వారా పరిష్కరించుకుంటే సమసిపోయే ఈ సమస్యలను భూతద్దంలోంచి చూడటమే ట్రంప్ చేస్తున్న పొరబాటు. తాను అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరలు, వాహనాలు, చమురు ధరలను భూమార్గం పట్టిస్తానంటూ నమ్మబలికిన ట్రంప్, ఇప్పుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తూండటమే విచిత్రం.సుంకాల పెంపువల్ల అక్రమ వలసలు ఏమాత్రం తగ్గుతాయో, ఫెంటానిల్ అక్రమ రవాణాకు ఏమేరకు ముకుతాడు పడుతుందో తెలియదుగానీ, ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం వికటిస్తే, ధరలు భారీగా పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రమాదం లేకపోలేదు. ట్రంప్ నిర్ణయం వల్ల ప్రస్తుతం 2.9 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం మరో 0.4 శాతం పెరిగే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికన్లను రక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతూనే, వారు కొంత ఇబ్బంది పడే అవకాశాలు లేకపోలేదని అగ్రరాజ్యాధినేత స్వయంగా అంగీకరించడం గమనార్హం. తమ దేశం అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధమనే ధీమాతో ఆయన ఉన్నట్లుగా కనబడుతోంది. కానీ, పేరుకు అగ్రరాజ్యమే అయినా చమురు సహా పలు ఉత్పత్తుల కోసం అగ్రరాజ్యం అనేక దేశాలపై ఆధారపడుతోందన్నది తోసిపుచ్చలేని నిజం. చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవడం ప్రజాస్వామిక దేశాలు అనుసరించే ప్రాథమిక సూత్రం. అయితే డొనాల్డ్ ట్రంప్‌కు చర్చలపై అంతగా నమ్మకం ఉన్నట్లు కనబడదు. దూకుడుగా ప్రవర్తించడం.బెదిరింపుల ద్వారా, ఆంక్షలు విధించి కట్టడి చేయడంద్వారా ఎదుటివారిని దారికి తెచ్చుకోవాలన్నది ఆయన సిద్ధాంతం. తాను అధికారంలోకి రాకముందే యుద్ధానికి ముగింపు పలకాలంటూ ఇజ్రాయెల్, హమాస్‌లను హెచ్చరించడాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సుంకాల పెంపుపై ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేస్తామని చైనా హెచ్చరించింది. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థనే ఖాతరు చేయని ట్రంప్, డబ్ల్యుటిఒ ఆదేశాలను శిరోధార్యంగా భావిస్తారని అనుకోలేం. ఈ సందర్భంగా మిన్నెసోటా గవర్నర్ అమీ క్లోబుచర్ అన్న మాటలు ప్రస్తావనార్హం. 'ట్రంప్ వచ్చాక గందరగోళం పెరిగింది. అవినీతి పెరిగింది. కోడిగుడ్ల ధరలు సైతం పెరిగాయి.ఇప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కావలసింది ఇది కాదు. ఉలిని వాడటానికి బదులు ఆయన పెద్ద సుత్తిని వాడుతున్నారు' అంటూ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేకపోలేదు. గోటితో పోయేదానికి ట్రంప్ గొడ్డలి వరకూ తీసుకువెళ్తున్నారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలు విధిస్తోందంటూ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం ద్వారా నష్టనివారణ చర్యలు చేపట్టింది. వచ్చే నెలలో అమెరికాలో పర్యటించనున్న ప్రధాని మోడీ.. ట్రంప్‌తో జరిపే ద్వైపాక్షిక చర్చలలో సుంకాల పెంపు సమస్యతోపాటు అగ్రరాజ్యంతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందడుగు వేయాలి.

# రష్యా హ్యాండిచ్చింది.. ఆర్మీని రంగంలోకి దించే సమయం ఆసన్నమైంది

- మొదటి పేజీ తరువాయి
అధ్యక్షుడు జెలెన్ స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని నివారించే క్రమంలో చర్చలు చేపడతామని చెప్పిన రష్యా.. తమకు హ్యాండిచ్చిందని.. ఎలాంటి చర్చలు జరపకపోగా.. యుద్ధానికి కవ్విస్తూ తన సహజ వైఖరిని కనబరుస్తోందని అన్నారు. రష్యాతో ఉక్రెయిన్ సుదీర్ఘ కాలంగా యుద్ధం చేస్తోందని, యూరోపియన్ ఆర్మీని ఆల్ రెడీ తాము ప్రారంభించినట్లేనని కీలక వ్యాఖ్యలు చేశారు. యూరోపియన్ ఆర్మీ ఆల్ రెడీ ఉందని తమ దేశాన్ని చూసి నిర్ధారణ చేసుకోవాలని అన్నారు. జర్మనీలోని మ్యునిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఆయన.. యూరోప్ ఆర్మీని ఏర్పాటు చేసుకోవడానికి అమెరికా మద్దతు ఇవ్వదని.. తనకు ఎప్పటికైనా సవాలేనని యూఎస్ భావిస్తుందని ఈ సందర్భంగా అన్నారు. "యూరోప్ ఆర్మీని ఏర్పాటు చేసుకునే టైమ్ వచ్చిందని నేను నమ్ముతున్నాను.. యూరోప్ భవిష్యత్తు యూరోపియన్లపైనే ఆధారపడి ఉంది.. రష్యాకు శాంతి అవసరం లేదు.. చర్చలకు సిద్ధంగా లేదు"అని ఈ సందర్భంగా జెలెన్ స్కీ అన్నారు. తమ పొరుగు దేశమైన బెలారస్ కు ఆర్మీని పంపి యుద్ధ శిక్షణ కార్యకలాపాలు చేపట్టాలని ప్లాన్ లో ఉన్నట్లు తెలిసిందని, అది నాటో కూటమికి ఎప్పటికైనా ముప్పేనని ఈ సందర్భంగా తెలిపారు.

# షష్ట షణ్ముఖ ఆలయ యాత్ర పూర్తి చేసుకున్న పవన్ కల్యాణ్

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దక్షిణ భారతదేశ ఆధ్యాత్మిక పర్యటన ముగిసింది. తమిళనాడులోని తిరుత్తణి క్షేత్ర సందర్శనతో పవన్ కల్యాణ్ చేపట్టిన షష్ట షణ్ముఖ యాత్ర ముగిసింది. ఈ ఉదయం మధురై జిల్లాలో అళగర్ కొండల్లో కొలువైన అరుల్మిగు సోలైమలై మురుగన్ ఆలయాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు పవన్ ను పూలమాలలు, శాలువాతో సత్కరించి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా మురుగన్ కు పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న స్కంద షష్టి కవచం, తిరుప్పుకల్ పారాయణంలో ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ఆయన తనయుడు అకీరా నందన్, మిత్రుడు టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి ఉన్నారు.

**అరుల్మిగు సోలైమలై**

ఆలయ సందర్శన అనంతరం పవన్ కల్యాణ్ తిరుత్తణి ఆలయానికి తరలి వెళ్లారు. ఇక్కడి సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో పవన్ వెంట తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసలు కూడా ఉన్నారు. షష్ట షణ్ముఖ యాత్రలో పవన్ కల్యాణ్ మొత్తం 6 సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు.

# ఒక బీసీ ప్రధానిగా రాణిస్తుంటే అగ్రవర్ణాలు జీర్ణించుకోలేకపోతున్నాయి

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఒక బీసీ ప్రధానమంత్రి గొప్పగా రాణిస్తుంటే అగ్రవర్ణాల్లోని కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. అత్యున్నత ప్రధాన మంత్రి పదవిని బీసీ చేపడితే ఓర్వలేకపోతున్నారన్నారు.ఈరోజు విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల ప్రతినిధులతో కృష్ణయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ కుల గణన తప్పులతడకగా సాగిందని, ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే నరేంద్ర మోదీ కులాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ప్రధాన మంత్రిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆయన అన్నారు. బీసీ సమస్యలను పక్కదారి పట్టించేందుకు రేవంత్ రెడ్డి కొత్త ఎత్తుగడ వేశారన్నారు.

మోదీ బీసీ కాదనడానికి ఆధారాలు లేకపోయినప్పటికీ ఆ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశంలోని బీసీలను అవమానించడమే అన్నారు. ఇందుకు ఆయన క్షమాపణలు చెప్పాలని ఆర్.కృష్ణయ్య అన్నారు. దేశంలో బీసీలకు రక్షణ కల్పించడానికి మోదీ చర్యలు చేపట్టారని ఆయన అన్నారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించారని,

విస్తృత అధికారాలు ఇచ్చారని అన్నారు.బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఇదివరకు సర్వేలో ప్రభుత్వం ఎన్నో ప్రశ్నలు అడిగిందని, అవన్నీ కాకుండా 3 ప్రశ్నలతో ఇంటింటికి సర్వే చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# 1994లోనే మోదీ కులాన్ని బీసీలో చేర్చారు

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కులంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సరికాదని అన్నారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. 1994లోనే నరేంద్ర మోదీ కులాన్ని బీసీల్లో చేర్చారని చెప్పారు. అప్పుడు గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉందని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ మండల్ కమిషన్ సిఫార్సులను తొక్కిపెట్టిందని ఆయన అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసిందని ఆయన అన్నారు. అరవై ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కుల గణనలలో అవకతవకలు జరిగాయని బీసీ సంఘాలే ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో ఇప్పుడు బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పైనే ఎక్కువ వ్యతిరేకత ఉందని కిషన్ రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆయన అన్నారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసే స్తోమత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. పలు యూనివర్సిటీలను అప్ గ్రేడ్ చేస్తామని చెప్పి విస్మరించారని మండిపడ్డారు.

# వైకాపా నేత వల్లభనేని వంశీ ఫోన్ ఎక్కడ..?

- మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్‌లో అరెస్టు చేసే సమయంలో ఆయన సెల్‌ఫోన్ దొరకలేదు. వ్యక్తిగత సహాయకుడి ఫోన్‌ను గురువారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు అరెస్టు చేసేందుకు వంశీ నివాసానికి పోలీసులు వెళ్లినప్పుడు.. దుస్తులు మార్చుకుని వస్తానని చెప్పి ఇంట్లోకి వెళ్లిన ఆయన దాదాపు గంట పాటు ఫోన్‌లో మాట్లాడినట్టు గుర్తించారు. గంట సేపు ఎవరితో మాట్లాడారు? ఏం మాట్లాడారనే విషయాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. వంశీ నివాసమంతా రెండు గంటల పాటు పోలీసులు జల్లెడ పట్టినా ఫోన్ దొరకలేదు. వంశీని అరెస్టు చేసిన తర్వాత చివరిగా సెల్ ఫోన్ టవర్ లొకేషన్ రాయదుర్గంలోని ఆయన నివాసంలోనే చూపించింది. కానీ, ఇంట్లో మొబైల్ దొరక్క పోవడంతో పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

వంశీని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన సమయంలో సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోలేకపోయారు.. ఇందు కోసం కోర్టు అనుమతి కోరుతూ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఇప్పటికే పిటిషన్ వేశారు. ఫోన్ తమ చేతికి వస్తే గుట్టు వీడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తే మరిన్ని ఆధారాలు లభిస్తాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసుల దృష్టి నుంచి తప్పించుకునేందుకు వంశీ రెగ్యులర్ కాల్స్ కాకుండా వాట్సప్‌లో మాట్లాడుతుంటారని తెలిసింది. ఈ నేపథ్యంలో ఫోన్‌కు సంబంధించి ఐపీడీఆర్ వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. ఆయన ఎవరెవరితో టచ్‌లో

ఉన్నారన్నది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇతర నిందితుల గాలింపులో ఈ సెల్‌ఫోన్ కీలకం కానుంది. పరారీలో ఉన్న నిందితుల కోసం మరో బృందం గాలింపు చేపడుతోంది.సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో 12 మంది ఉన్నట్టు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. వంశీతో సహా మొత్తం ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేశారు. వంశీ ప్రధాన అనుచరుడు కోటేశ్వరరావు అలియాస్ కోట్లు ఈ కేసులో ఏ2గా ఉన్నాడు. కోట్లు ద్వారానే వంశీ.. సత్యవర్ధన్‌ను కలిసినట్టు సమాచారం. కోట్లుని అదుపులోకి తీసుకుంటే కేసులో పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# ఇద్దరూ కలిసి రాష్ట్ర రైతులను నిండా ముంచారు

- మొదటి పేజీ తరువాయి
ధరల స్థిరీకరణ పేరుతో రాజకీయాలు చేశారే తప్ప... రైతుకు రూపాయి ఇచ్చింది లేదు.

రాష్ట్రంలో వరి ధాన్యానికి బస్తాకు రూ.1,400 మించి ధర పలకడం లేదు... పత్తి ధర రూ.12 వేల నుంచి రూ.6 వేలకు పడిపోయింది. మిర్చి రూ.23 వేలు అందాల్సిన చోట రూ.11 వేల కంటే ఎక్కువ ధర అందడంలేదు. కంది రూ.10 వేల నుంచి రూ.7 వేలకు పడిపోయింది. రాష్ట్రంలో 55 లక్షల మంది రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ఏడాదికి రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని తక్షణమే ఏర్పాటు చేయండి... గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి. అన్నదాత సుఖీభవ పథకంలో ఇస్తామని చెప్పిన రూ.20 వేల సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల పేర్కొన్నారు.

# హామీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు

**పెన్ పవర్ డెస్క్:**మాజీ ముఖ్యమంత్రి జగన్ పై ఏపీ బీజేపీ నేత సోము వీర్రాజు విమర్శనాస్త్రాలు సంధించారు. హామీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని అన్నారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేస్తోందని తెలిపారు. బటన్ నొక్కి హామీలు అమలు చేసిన జగన్ కు ప్రజలు 11 సీట్లే ఎందుకు ఇచ్చారో తెలియదా? అని సోము వీర్రాజు ఎద్దేవా చేశారు. తెలంగాణ, ఢిల్లీలో ప్రజల తీర్పులు గమనించాలని... ఇకనైనా వ్యక్తిగత విమర్శలు, దిగజారుడు ఆరోపణలు సరికాదు అని హితవు పలికారు.

# తప్పు చేసిన వైసీపీ నేతలు తప్పించుకోలేరు

- మొదటి పేజీ తరువాయి
తమపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు.

**లోకేశ్ ను కలిసిన వెటర్నరీ విద్యార్థులు**

కాగా, వెటర్నరీ విద్యార్థులు ఇవాళ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను కలిశారు. వారి సమస్యలను లోకేశ్ సానుకూల ధోరణితో విన్నారు. ఎన్టీఆర్ వర్సిటీ వెటర్నరీ విద్యార్థులు స్టయిఫండ్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు సమానంగా స్టయిఫండ్ ఇవ్వాలని కోరారు. వెటర్నరీ విద్యార్థుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తానని లోకేశ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# అన్నదాతలపై చంద్రబాబు పగ పెంచుకున్నారు

- మొదటి పేజీ తరువాయి
జగన్ తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలను చంద్రబాబు నిర్వీర్యం చేశారని విమర్శించారు. జగన్ కు పేరు వస్తుందనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మాటల్లో తప్ప చేతల్లో లేదని అన్నారు. మిర్చికి ధరలు లేక రైతులు నష్టపోతున్నారని కాకాణి ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 6 వేల కోట్ల మేర మిర్చి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని... రైతులు ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చెయ్యకపోవడం వల్ల... రైతులు అప్పులు తెచ్చుకుని వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. రాబడి తగ్గడంతో రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రోజా దగ్గర బంధువు అయిన మహిళతో కిరణ్ రాయల్ కు అక్రమ సంబంధం ఉంది

- మొదటి పేజీ తరువాయి
రాత్రే బయటకు వచ్చాడని... దీనికి కారణం రోజా బంధువుతో ఉన్న అక్రమ సంబంధమే కారణమని చెప్పారు. ఆ మహిళను బెదిరించి కిరణ్ బయటకు వచ్చాడని తెలిపారు. అవసరానికి వాడుకుని, అవసరం తీరాక ఆమెపై దాడి చేశాడని మండిపడ్డారు. తిరుపతిలో మీడియాలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు భూమన అభినయ్ రెడ్డితో తనకు అక్రమ సంబంధం ఉందని కిరణ్ చెప్పడం దారుణమని లక్ష్మిరెడ్డి అన్నారు. అభినయ్ తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లు అమ్ముకోవడం కిరణ్ కే చెల్లిందని అన్నారు. చెన్నై నుంచి చీరలు తెచ్చి శ్రీవారి వస్త్రం పేరుతో అమ్ముకుని వ్యాపారం చేస్తాడని చెప్పారు. ఫొటోలు మార్ఫింగ్ అని చెప్పి తనపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ నే బ్లాక్ మెయిల్ చేస్తా... నువ్వెంత అని తనను బెదిరించాడని చెప్పారు. మార్ఫింగ్ కేసులో కిరణ్ రాయల్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఫంక్షన్ లో పేలిన హైడ్రోజన్ బెలూన్స్.. మంత్రికి తీవ్ర గాయాలు

- మొదటి పేజీ తరువాయి
శనివారం (ఫిబ్రవరి 15) పోఖారా పర్యాటక సంవత్సరం ప్రారంభోత్స కార్యక్రమంలో నేపాల్ ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడెల్, పోఖారా మెట్రోపాలిటన్ మేయర్ ధన్‌రాజ్ ఆచార్య పాల్గొన్నారు. హైడ్రోజన్ బెలూన్స్ ను గాల్లోకి వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించబోతుండగా.. బెలూన్స్ ఒక్కసారిగా పేలాయి. దీంతో ఉప ప్రధాని బిష్ణు ప్రసాద్, మేయర్ ధన్‌రాజ్ ఆచార్యలకు గాయాలు అయ్యాయి. వెంటనే అలర్ట్ అయిన అధికారులు ఇద్దరినీ విమానంలో ఖాట్మండుకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కీర్తిపూర్‌లోని బర్న్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని పేలుడికి గల కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై ఉప ప్రధాని ప్రెస్ అడ్వైజర్ భువన్ కెసి స్పందించారు. వదలడానికి సిద్ధంగా ఉంచిన బెలూన్ల పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. పౌడెల్ చేతి, ముఖంపై గాయాలయ్యాయి. మేయర్ ఆచార్యకు కూడా తీవ్రంగా గాయపడ్డారని ఆయన తెలిపారు.

# శ్యామల కామెంట్స్... షర్మిలకు సపోర్టేనా



**నెల్లూరు, ఫిబ్రవరి 15, పెన్ పవర్:** బ్రహ్మా ఆనందం సినిమా రిలీజ్ సంధర్భంగా మెగాస్టార్ చిరంజీవి సరదాగా పలు కామెంట్స్ చేశారు. తన ఇంటిలో తనకు లేడీస్ హాస్టల్ వార్డెన్ అనే ఫీలింగ్ వస్తుందని మెగాస్టార్ అన్నారు. తమ వారసత్వాన్ని కొనసాగించేందుకు వారసుడిని ఇవ్వాలని, రామ్ చరణ్ కు చెప్పినట్లు తన మదిలో మాట సరదాగా మెగాస్టార్ చెప్పారు. ఈ కామెంట్స్ కాస్త వివాదంగా మారాయి. మెగాస్టార్ చేసిన కామెంట్స్ పై వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల స్పందించారు. కుమారులే వారాసులవుతారా? కుమార్తెలు వారసులు కారా అంటూ శ్యామల ప్రశ్నించారు. అంతటితో ఆగక, కోడలు ఉపాసన అన్ని రంగాలలో రాణిస్తూ వారసత్వాన్ని అందిపుచ్చుకోలేదా అంటూ శ్యామల ప్రశ్నించారు. శ్యామల కామెంట్స్ ని బట్టి కుమార్తెలు కూడా వారసులవుతారని ఆమె అభిప్రాయం. ఈ కామెంట్స్ సెగ నేరుగా మాజీ సీఎం జగన్ కు తగిలాయని సోషల్ మీడియా కోడై కూస్తోంది.వైఎస్ జగన్ ఆమె సోదరి వైఎస్ షర్మిళ మధ్య ఆస్తి తగాదాలు ఉన్న విషయం అందరికీ తెల్సిందే. ఇటీవల ఆస్తి తగాదాలు వెలుగులోకి రాగా, పరస్పర విమర్శల జోరు సాగింది. షర్మిళ తన మాటలతో జగన్ పై అస్త్రాలు సంధించగా, జగన్ కూడా అదే రీతిలో స్పందించారు. కన్నతల్లిపై కేసు పెట్టారని, ఇదేనా తల్లికి ఇచ్చే గౌరవం అంటూ షర్మిళ ఫైర్ అయ్యారు. తనపై సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెట్టించిన ఘనత కూడా అన్నదే అంటూ సంచలన కామెంట్స్ చేశారు. వీరి ఆస్తుల వివాదం బాగా ముదిరి, చివరకు న్యాయస్థానాలకు చేరింది. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది.జగన్ జైలుకు వెళ్లిన సమయంలో షర్మిళ.. వైసీపీ బలోపేతానికి చేసిన కృషి అందరికీ తెలిసిందే. ఓదార్పుయాత్ర కొనసాగించి పార్టీకి బూస్ట్ ఇచ్చారని క్యాడర్ చెబుతుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే, షర్మిళ ను జగన్ పక్కన పెట్టేశారని పలుమార్లు షర్మిళ భర్త అనిల్ ఆరోపించారు. తమకు ఆస్తుల తగాదాల వల్లే విభేధాలు వచ్చాయని అనిల్ తెగేసి చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ వారసురాలిగా తనకు హక్కు ఉందన్న వాదనను షర్మిళ వక్కాణించి పలికారు. జగన్ కు ఉన్న హక్కు తనకు ఉందంటూ, వైఎస్సార్ సూచించినట్లుగా ఆస్తుల పంపకాలు జరగాలన్నది ఆమె వాదనవీరి ఆస్తి వివాదం వల్ల వైఎస్సార్ అభిమానులు కూడా రెండు గ్రూపులుగా తయారయ్యారని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇలాంటి తరుణంలో మెగాస్టార్ చేసిన కామెంట్స్ పై గురిపెట్టిన శ్యామల, స్పందిస్తూ చేసిన కామెంట్స్ నేరుగా జగన్ కు తగిలాయని టీడీపీ విమర్శిస్తోంది. అలాగే జనసేన కూడా.. షర్మిళ గతంలో ఆస్తి పంపకాలపై చేసిన కామెంట్స్ ని పోస్ట్ చేస్తూ.. శ్యామల గారూ.. ఇదే మాట మీ అధినేతకు చెప్పండని కోరుతున్నారు. తండ్రికి కుమార్తెలు వారసులుగానే పరిగణించ బడతారని, షర్మిళకు రావాల్సిన ఆస్తిని అలాగే అప్పజెప్పేలా చూడాలని శ్యామలను కూటమి నేతలు కోరుతున్నారు. శ్యామల తన కామెంట్స్ తో మెగాస్టార్ ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తే, ఆ కామెంట్స్ ను మాజీ సీఎం జగన్ కు ఆపాదించి జనసేన, టీడీపీ పోటాపోటీగా ట్రోలింగ్ చేస్తున్నాయి. వైఎస్ షర్మిళకు శ్యామల మద్దతునివ్వడం హర్షించదగ్గ విషయమని సోషల్ మీడియా అంటోంది. మరి ఈ కామెంట్స్ కి శ్యామల రిప్లై ఎలా ఉంటుందో వేచి చూడాలి.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# పవన్ కోసం బీజేపీ సైన్యం



**తిరుపతి, ఫిబ్రవరి 15, పెన్ పవర్: )** కేరళ నుంచి తమిళనాడుకు వెళ్లిన పవన్ కల్యాణ్ పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. మొదట స్వామిమలై శ్రీ స్వామినాథస్వామి వారిని దర్శించుకున్నారు. తర్వాత కుంభకోణంలోని ఆది కుంభేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మంత్రపీతేశ్వరి అమ్మవారికి అర్చనలు చేశారు. శ్రీ అగస్త్య కుంభముని ధ్యాన పీఠాన్ని సందర్శించారు. కుంభేశ్వరాలయ దర్శనానికి ఎవరు వచ్చినా మొదట ఆది గణపతి దర్శనం తర్వాతే మూల విరాట్ దర్శించాలన్న నియమం ఉంది. ఆలయ సంప్రదాయం మేరకు పవన్ కళ్యాణ్ ఆదివినాయగర్ ని మొదట పూజిచారు. ఆదికుంభేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత భాంధం ఆకారంలో ఉన్న శివలింగ విశిష్టతను పవన్ కళ్యాణ్ కి అర్చకులు వివరించారు. అమృతం, ఇసుక కలిసి ఉద్భవించిన ఈ లింగానికి అభిషేకాలు నిర్వహించరు. అందుకే విశిష్ట పూజలు నిర్వహించారు. పంచ హారతులు ఇచ్చి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆది కుంభేశ్వరాలయంలో స్వామి వారికి ఎడమవైపు వెలసిన పార్వతీదేవి అవతారం మంగళనాయకి అమ్మాన్. అమ్మవారిని మంత్రపీతేశ్వరిగానూ కొలుస్తారు. 72 కోట్ల మంత్రాల శక్తి అమ్మవారిలో నిక్షిప్తమై ఉండడం వల్ల అమ్మవారికి ఆ పేరు వచ్చింది. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా పవన్ కళ్యాణ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆది కుంభేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న మరో విశిష్ట ప్రదేశం శ్రీ అగస్త్య ధ్యాన పీఠ మందిరం. అమ్మవారి దర్శనానంతరం పవన్ కళ్యాణ్ ప్రధాన ఆలయానికి నైరుతి దిశలో ఉన్న ఈ ధ్యానపీఠాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో కూర్చుంటే తెలియకుండానే ధ్యాన ముద్రలోకి వెళ్లిపోతారని ధ్యాన మందిర విశిష్టతను అర్చకులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. అంతకు ముందు ఆలయ ఆస్థాన గజం మంగళంతో కలసి అర్చకులు, అధికారులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. ఆలయ ఆస్థాన ఏనుగుకు అరటి పళ్లు అందించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. నాలుగు సంవత్సరాలుగా శ్రీ అగస్త్య మహా ముని ఆలయం, స్వామిమలై శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్ర దర్శనం కోసం వేచి చూస్తున్నానని, ఇప్పటికి ఆ మురుగన్ అనుగ్రహం లభించడంతో క్షేత్ర దర్శనం చేసుకోవడానికి వచ్చినట్టు పవన్ కళ్యాణ్ తెలిపారు. రాజకీయ అంశాల గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆలయాల్లో రాజకీయాలు వద్దు అంటూ సున్నితంగా బదులిచ్చారు. స్వామిమలై, కుంభకోణం సందర్శనకు విచ్చేసిన పవన్ కళ్యాణ్ గారికి భారతీయ జనతా పార్టీ తమిళనాడు శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పూల మాలలు, శాలువాలతో బీజేపీ నాయకులు సత్కరించారు. బాణసంచా పేల్చి సంబరాలు చేశారు. తిరుచెందూరు క్షేత్రానికి వెళ్లి అరుల్మిగు సుబ్రహ్మణ్య స్వామి వారిని దర్శించుకుంటారు

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# నిండా మునిగిన పౌల్ట్రీ ఇండస్ట్రీ

**ఏలూరు, ఫిబ్రవరి 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పౌల్ట్రీ పరిశ్రమ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిండా మునిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఏడాది డిసెంబర్ నుంచి పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పౌల్ట్రీ పరిశ్రమ భారీగా నష్టపోవాల్సి వస్తోంది. వదంతులు వ్యాపించడంతో ధరలు పడిపోయాయి.ఏపీలో కోళ్ల పరిశ్రమకు అనువైన సీజన్‌లో వైరస్ బారిన పడి లక్షల సంఖ్యలో కోళ్లు మరణించడంతో పౌల్ట్రీ ఇండస్ట్రీ తీవ్రంగా నష్టపోయింది. వదంతుల్ని కట్టడి చేయడంలో పశు సంవర్ధక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వ్యాధి నిర్ధారణ తర్వాత చేపట్టాల్సిన చర్యల విషయంలో తీరిగ్గా వ్యవహరించడంతో భారీగా డామేజ్ జరిగింది. బర్డ్ ఫ్లూ నిర్ధారణ జరిగిన తర్వాత కూడా పౌల్ట్రీ ఇండస్ట్రీలో అనుమానాలు తీర్చడంలో ఏపీ పశు సంవర్ధకశాఖ నిర్లక్ష్యం వహించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మాంసం, గుడ్లు విక్రయాలు పడిపోయాయి.ఆంధ్రప్రదేశ్‌లో రెండు నెలలకు పైగా కోళ్లు అనూహ్యంగా చనిపోతున్నాయి. ఒకేసారి భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడంపై పశు సంవర్ధక శాఖ పెద్దగా పట్టించుకోలేదు. నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో కోళ్ల పెంపకానికి అనువుగా ఉంటుంది. కోడి పిల్లలు వేగంగా బరువు పెరుగుతాయి. 45-60 రోజుల్లో సిద్ధం అవుతాయి. ఈ క్రమంలో గత ఏడాది డిసెంబర్‌లో గోదావరి జిల్లాల్లో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోయాయి. తెగులు సోకిందని భావించి వాటిని పూడ్చేశారు.అప్పట్లో కోళ్ల మరణాలపై ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదు. మరోవైపు కొల్లేరు ప్రాంతానికి వలస పక్షులు వచ్చే సీజన్‌లో జరిగిన మరణాలను పెద్దగా పట్టించుకోలేదు.వలస పక్షుల వైరస్ జలాశయాల నుంచి నీళ్ల ద్వారా వ్యాప్తి చెంది ఉంటుందనే అనుమానాలు ఉన్నాయి. దీంతో డిసెంబర్ నుంచి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వైరస్ వ్యాప్తి చెందింది. చివరకు ఫిబ్రవరి మొదటి వారానికి లక్షల్లో కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ మొత్తం వ్యవహారంలో పశు సంవర్ధక శాఖ సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టక పోవడం, సకాలంలో పౌల్ట్రీ పరిశ్రమను అప్రమత్తంగా చేయక పోవడంతో భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది.ఏపీలో కోళ్ల ఫారాలు ఎక్కువగా ఉన్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఫ్లూ కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ వినియోగంతో ఎలాంటి నష్టం లేదని చెబుతున్నా జనంలో మాత్రం అనుమానాలు పెరిగిపోయాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వారానికి 20వేల టన్నులు బాయిలర్ మాంసం విక్రయాలు జరిగేవి. మరో 15వేల టన్నులు ఫారం కోళ్లను తినేవారు. ఫ్లూ ప్రభావంతో బ్రాయిలర్ కోళ్ల వ్యాపారాలు దారుణంగా పడిపోయాయి. ఫారం కోళ్లను కొనడానికి ఎవరు ముందుకు రావట్లేదు. ఏలూరు జిల్లా బాదంపూడిలో బర్డ్ ఫ్లూ గుర్తించడంతో దాని ప్రభావం మొత్తం జిల్లాపై పడింది.ఏలూరు జిల్లాలో ఒకరికి బర్డ్ ఫ్లూ సోకిందంటూ వదంతులు చెలరేగాయి. దీనిపై ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి స్పందించారు. అసత్యప్రచారాలను ఖండించారు. ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బర్డ్ సోకిన కోళ్లను శాస్త్రీయ పద్ధతుల్లో ఖననం చేస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగ రాణి చెప్పారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులో గురువారం నిర్వహించిన కోళ్ల ఖననం చేసే పనులను పరిశీలించారు.

బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన పనిలేదన్న అచ్చెన్నాయుడు

బర్డ్ ఫ్లూ పై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బర్డ్ ఫ్లూ నియంత్రణకు పటిష్టమైన చర్యలను చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీతో పాటు బోపాల్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యురిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్ శాస్త్రవేత్తలతో కూడా చర్చించారన్నారు. కేంద్ర నుండి ఇప్పటికే పలు బృందాలు రాష్ట్రానికి వచ్చాయని, కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ కూడా శుక్రవారం రాష్ట్రానికి రానున్నారని ఆయన తెలిపారు.బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎటు వంటి భయం లేకుండా బాగా ఉడికించిన గ్రుడ్లను, మాంసాన్ని నిరభ్యంతరంగా తినవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో పలు మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు వార్తలు, సమాచారం వల్ల ప్రజలు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రజలు బయాందోళనలకు గురయ్యేలా బర్డ్ ఫ్లూ పై తప్పుడు వార్తలు, సమాచారాన్ని వ్యాప్తి చేసేవారి పై కఠిన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.బర్డ్ ఫ్లూ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, కానూరు మరియు కృష్ణా జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని ఐదు ఫ్రౌల్ట్రీల్లో ఈ వ్యాది సోకినట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలను బయో సెక్యురిటీ జోన్లుగా ప్రకటించి, అధికారులను, సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించి వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలను చేపట్టడం జరిగిందన్నారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

## కర్నూలులో ప్రైవేట్ గోల్డ్ మైనింగ్

**కర్నూలు, ఫిబ్రవరి 15, పెన్ పవర్:** ఏపీలో తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. కర్నూలు జిల్లాలోని జొన్నగిరి ప్రాంతంలో ఈ బంగారం మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 18వ తేదీన ఆ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ఈ ప్లాంట్ కోసం జియోమైసూర్ అండ్ డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ రెండేళ్ల నుంచి పైలెట్ ప్రాజెక్టు పనులు చేపట్టాయి. ఎట్టకేలకు త్వరలోనే ఈ ప్లాంట్ ద్వారా కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఇక జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్లాంట్ కోసం ఏపీ ప్రభుత్వం ఈ నెలలోనే ప్రజాభిప్రాయాన్ని సేకరించనుంది. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత పర్యావరణ అనుమతులు లభిస్తే.. మూడు నెలల్లోగా ఈ ప్లాంట్ నుంచి బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 750 కేజీల బంగారం ఉత్పత్తి చేయాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.1994లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లాలో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. అనంతరం ఈ బంగారం తవ్వితీసేందుకు ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించారు. అయితే భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందనే కారణంతో ప్రైవేట్ కంపెనీలు ముందుకు రాలేదు. ప్రాథమిక అధ్యయనాలు జరపడానికి కూడా భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందనే కారణంతో వెనకడుగు వేశాయి. అయితే 2005లో కేంద్రం మైనింగ్ లీజ్ ప్రక్రియను సులభతరం చేసింది. ఓపెన్ లైసెన్సింగ్ పాలసీ తెచ్చింది. అనంతరం మరోసారి ప్రైవేట్ కంపెనీలను ఆహ్వానించారు. ఈ క్రమంలోనే బెంగళూరుకు చెందిన జియోమైసూర్ సర్వీసెస్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. 2013లో జొన్నగిరి మండలంలో ట్రయల్స్ జరిపేందుకు ప్రాథమిక అనుమతి సంపాదించింది. అయితే పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు కావాల్సిన అన్ని అనుమతులు పొందడానికి సుమారు పదేళ్లు పట్టింది.జియోమైసూర్ సర్వీసెస్ లిమిటెడ్‌లో భాగస్వామిగా ఉన్న డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ కూడా ఈ ప్రక్రియలో భాగం పంచుకుంది. అనంతరం 1500 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. అలాగే తుగ్గలి, మద్దికెర మండలాల్లో 750 ఎకరాల భూమిని కొనుగోలు చేసి.. 2021లో పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ఒక చిన్న ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుని బంగారం వెలికితీత పనులు ప్రారంభించారు. సుమారు రెండేళ్ల పాటు పైలెట్ ప్రాజెక్టు పనులు చేపట్టిన తర్వాత ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా వాణిజ్యపరమైన కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

## వంశీ తర్వాత కొడాలి నాని



**విజయవాడ, ఫిబ్రవరి 15, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ రెడ్ బుక్ లో ఉండే మొదటి పేర్లలో కొడాలి నాని, వల్లభనేని వంశీ పేర్లు ఉంటాయి. ఈ ఇద్దరు మాజీ తెలుగుదేశం పార్టీ నేతలు రాజకీయం చేయలేదు. వ్యక్తిగత శత్రుత్వం పెంచుకుంది. రాజకీయాల్లో మాట్లాడకూడని మాటల్ని మాట్లాడారు. చంద్రబాబును, ఎన్టీఆర్ కుటుంబాన్ని ఘోరంగా అవమానించారు. చంద్రబాబును మానసికంగా దెబ్బతీయడానికి వైసీపీ అధినేత పన్నిన వ్యూహం అదని వైసీపీ వర్గాలు చెబుతాయి కానీ టీడీపీకి మాత్రం వారిద్దరూ మోస్ట్ వాంటెంట్ టార్గెట్ అయ్యారు. అయితే ఎన్నికల్లో ఇద్దరు భారీ తేడాతో ఓడిపోయి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కనిపించను కూడా కనిపించడం లేదు. తెర వెనుక రాజకీయం చేస్తున్నారు. దీంతో వంశీ దొరికిపోయారు.గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి, కార్లు తగులబెట్టడం వంటివి అప్పట్లో సంచలనం సృష్టించాయి. వల్లభనేని వంశీ దగ్గరుండి ఆ దాడిని మానిటర్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును వైసీపీ హయాంలో నామమాత్రంగా నమోదు చేయడమే కాకుండా టీడీపీ నేత అయిన పట్టాభిపైనే కేసులు పెట్టి జైలుకు పంపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన సీసీ ఫుటేజీ ఆధారంగా కేసులు పెట్టారు. సత్యవర్ధన్ అనే టీడీపీ ఆఫీసులో పని చేసే ఉద్యోగి ఫిర్యాదులో అట్రాసిటీ కేసులు పెట్టారు. ఈ కేసులో వంశీ ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.అయితే అసలు కేసే లేకుండా చేసేందుకు సత్యవర్ధన్ ను ట్రాప్ చేసి.. కోర్టులో నేరుగా వాంగ్మూలం ఇప్పించడంతో టీడీపీని రెచ్చగొట్టినట్లయింది. వెంటనే .. అసలేం జరిగిందో ఆరా తీసి.. పోలీసులు వంశీని అరెస్టు చేసేశారు. మామూలుగా జోక్యం చేసుకోకుండా ఉంటే పోలీసులు తొందరపడేవారు కాదేమో కానీ.. చాన్స్ ఇవ్వడంతో అరెస్టు కావాల్సి వచ్చింది. తర్వాత కొడాలి నాని అనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. వంశీ కంటే ఎక్కువగా కొడాలి నాని పై టీడీపీ క్యాడర్ కు కోపం ఉంది. ఆయనపై గుడివాడలో పలు కేసులు నమోదయ్యాయి. అరెస్టు చేయాలనుకుంటే పెద్ద విషయం కాదు. కానీ కొడాలి నాని ఎక్కడ ఉన్నారో బయటకు తెలియడం లేదు. అరెస్టు విషయంలో కక్ష సాధింపులు అనే మాట రాకుండా ఉండేందుకు ప్రభుత్వం కూడా సరైన సమయం కోసం చూస్తోంది. కొడాలి నాని కూడా తెర వెనుక ఏదైనా రాజకీయాలు చేస్తూంటే.. ఆయనను కూడా పట్టేసుకుని అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయి. వైసీపీ ఓడిపోవడానికి ప్రధాన కారకుల్లో వైసీపీ నేతలు కూడా వంశీ, కొడాలి నాని పేరు చెబుతారు. ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి వైసీపీపై ప్రజల్లో అసహ్యం పెరిగేలా చేశారని అంటారు. అందుకే వీరి అరెస్టు విషయంపై వైసీపీ క్యాడర్ లో ఎలాంటి స్పందన లేదు. కొంత మంది నేతలు మాత్రం ప్రెస్‌మీట్లలో ఖండించారు. అధినేత జగన్మోహన్ రెడ్డి నుంచి మాత్రం ఎలాంటి ఖండన ప్రకటన రాలేదు. అన్యాయం అని ట్వీట్ కూడా చేయలేదు. దీంతో వంశీ విషయంలో జగన్ సపోర్టు ఉండదని భావిస్తున్నారు. పార్టీ పరంగా సపోర్టుగా కొంత మంది నేతలు మాట్లాడుతున్నారు. కానీ అధ్యక్షుడు వెంటనే స్పందించకపోవడం వంశీకి ఇబ్బందే. రేపు కొడాలి నానీకి ఇదే పరిస్థితి ఎదురయితే.. వారు రాజకీయంగానే కాదు.. వ్యక్తిగతంగానూ నష్టపోయినట్లే.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

## కార్యకర్తల వద్దకు వెళ్లేందుకు జగన్ సంకోచం

**విజయవాడ, ఫిబ్రవరి 15, పెన్ పవర్:** చంద్రబాబు పాలన మోసాలను అందరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని జగన్మోహన్ రెడ్డి తాను సమావేశం అయ్యే..తనతో సమావేశం అయ్యే వైసీపీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అందరూ ప్రజల్లోనే ఉండాలని చెబుతున్నారు. అయితే జగన్ మాత్రం ప్రకటించిన కార్యక్రమాన్ని కూడా ప్రారంభించేందుకు సిద్ధంగా లేరు. కొద్ది రోజుల కిందట జగన్ " కార్యకర్తలతో జగనన్న - భవిష్యత్ కు దిశానిర్దేశం" పేరుతో కార్యక్రమాన్ని ప్రకటించారు. సంక్రాంతి అయిపోగానే కార్యకర్తల వద్దకు వస్తానని చెప్పారు. అందర్నీ కలుస్తానని వివరించారు. జగన్ చెప్పిన తీరుతో కార్యకర్తలు చాలా మంది ఆయన నిజంగానే వస్తారనుకున్నారు. కానీ జగన్ ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీని పునర్ నిర్మాణం చేసుకోవాల్సిన పరిస్థితుల్లో జగన్.. జిల్లాల అధ్యక్షుల్ని నియమించే ప్రయత్నం చేశారు. అయితే నియమితులైన చాలా మంది అట్టరహాసంగా ప్రమాణం చేశారు కానీ ఎవరూ యాక్టివ్ గా లేరు. కింది స్థాయి వరకూ పార్టీని నిర్మాణం చేయాలని జగన్ అనుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకూ ఓ లేయర్ లో కూడా పార్టీ నాయకత్వాన్ని సిద్ధం చేయలేదు. అదే సమయంలో సిక్కోలు నుంచి చిత్తూరు వరకూ చాలా మంది సీనియర్ నేతలు సైలెంట్ గా ఉన్నారు. వారు సహకరించకపోతే కార్యకర్తలతో సమావేశాలు ఫెయిలయ్యే ప్రమాదం ఉంది. వైఎస్ జగన్ పులివెందుల నియోజకవర్గానికి వెళ్లినప్పుడు కార్యకర్తలను కలవడానికే తంటాలు పడుతున్నారు. వచ్చిన వారంతా బిల్లులు సారూ అంటున్నారు.కోట్లు ఖర్చు పెట్టి పనులు చేశారు కానీ ఇప్పుడు బిల్లులు రావడం లేదు. మరో వైపు పార్టీని నమ్ముకుని బెట్టింగులు కాసి నష్టోయామని ఆదుకోవాలని చాలా మంది అడుగుతున్నారు. వీరు ప్రతి నియోజకవర్గంలోనూ ఉంటారని ఇలాంటి వారు చేసే అలజడితో మీడియా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుందని అతి పార్టీకి మరింత డ్యామేజీ చేస్తుందన్న ఉద్దేసంతో జగన్ ఆగిపోయారని అంటున్నారు. జగన్ ఎంతో కొంత సాయం చేస్తారని కార్యకర్తల నుంచి ఇఎక్స్ పెక్టేషన్స్ ఉంటాయి. వాటిని తగ్గించిన తర్వాత జగన్ జనంలోకి వెళ్లేలా ప్లాన్ చేసుకుంటున్నారని అంటున్నారు . అధికారం వచ్చిన ఐదేళ్లలో జగన్ కార్యకర్తలను పట్టించుకోలేదని ఇటీవల అంగీకరిస్తున్నారు. జగన్ 2.0లో కార్యకర్తల కేసమే పని చేస్తానంటున్నారు. అయితే ఈ ప్రకటనకు అంత కదలిక లేదని వైసీపీ వర్గాలు అంచనాకు వచ్చాయి. మరో వైపు ప్రభుత్వంపై ఎంతో కొంత అసంతృప్తి ప్రజల్లో ప్రారంభమైతే.. జగన్ పర్యటనలకు స్పందన కనిపిస్తుందని భావిస్తున్నారు. అయితే జగన్ పాలనపైనే ఇప్పటికే విస్తృత ప్రచారం జరుగుతూండటంతో వైసీపీ నేతలు కూడా మండిపడుతున్నారు. వైసీపీ పాలనలో ఏదో జరిగిందని కూటమి ప్రభుత్వం నమ్మించే ప్రయత్నం చేస్తోందని ..దాన్ని తిప్పికొట్టాలని జగన్ పార్టీ నేతలకు అంటున్నారు. అంటే ప్రజలు ఇంకా కూటమి చెప్పేదే వింటున్నారి.. ఆ పరిస్థితి మారే వరకూ ఎదురుచూడటం మంచిదని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా జగన్ కార్యకర్తల్లోకి వెళ్లే అంశంపైనా ముందూ వెనుకాడుతున్నారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# ఏయే జట్లు ఏ గ్రూప్ లో ఉన్నాయి.. గ్రూప్ ఏ, గ్రూప్ బి ఫైనల్ స్క్వాడ్ లిస్ట్ ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** అభిమానులను అలరించడానికి ఐసీసీ టైటిల్ సిద్ధంగా ఉంది. 2017 తర్వాత మరోసారి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. వన్డే ఫార్మాట్ లో టాప్ 8 జట్లు ఆడే ఈ టోర్నీపై భారీ హైప్ నెలకొంది. తొమ్మిదో ఎడిషన్ ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు జరుగుతుంది. పాకిస్తాన్,దుబాయ్ వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. పాకిస్థాన్ లోని లాహోర్, కరాచీ, రావల్పిండి ఎనిమిది జట్లు ఆడే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

భారత జట్టు పాల్గొనే మ్యాచ్‌లు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ గ్రూప్ ఏ లో ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ గ్రూప్ బి లో ఉన్నాయి. బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్,ఇండియా తమ ఫైనల్ స్క్వాడ్ ను ప్రకటించేశారు. టోర్నీకి ముందు అన్ని జట్ల పూర్తి స్క్వాడ్ లను ఒకసారి చూద్దాం

**గ్రూప్ ఏ**

**భారత్:**రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ , విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కెఎల్ రాహుల్ , రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ , హర్షిత్ రాణా, మహ్మద్. షమీ, అర్ష్‌దీప్ సింగ్, రవీంద్ర జడేజా , వరుణ్ చకరవర్తి.

**బంగ్లాదేశ్:**నజ్ముల్ హొస్సేన్ శాంటో (కెప్టెన్), సౌమ్య సర్కార్ , తంజిద్ హసన్, తౌహిద్ హృదయ్, ముష్ఫికర్ రహీమ్, మహమూద్ ఉల్లా, జాకర్ అలీ అనిక్, మెహిదీ హసన్ మిరాజ్, రిషద్ హొస్సేన్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రహ్మాన్ , పర్వేజ్ రెహ్మాన్, తంజిమ్ హసన్ సాకిబ్, నహిద్ రాణా.

**న్యూజిలాండ్:** మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, టామ్ లాథమ్, డారిల్ మిచెల్, విల్ ఓ'రూర్కే, గ్లెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, నాథన్ స్మిత్, కేన్ విలియమ్సన్ , విల్ యంగ్, జాకబ్ డఫీ

**పాకిస్థాన్:**మహ్మద్ రిజ్వాన్ (కెప్టెన్), బాబర్ అజామ్ , ఫఖర్ జమాన్ , కమ్రాన్ గులాం, సౌద్ షకీల్, తయ్యబ్ తాహిర్, ఫహీమ్ అష్రఫ్ , ఖుష్దిల్ షా, సల్మాన్ అలీ అఘా, ఉస్మాన్ ఖాన్, అబ్రార్ అహ్మద్, హరీస్ రవూఫ్, మహ్మద్ షాహదీన్, నసీమ్ షాహదీన్.

**గ్రూప్ బి**

**ఆఫ్ఘనిస్తాన్:** హష్మతుల్లా షాహిదీ (కెప్టెన్), ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్, సెదిఖుల్లా అటల్, రహమత్ షా, ఇక్రమ్ అలీఖిల్, గుల్బాదిన్ నాయబ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగ్యాల్ ఖరోటీ, నూర్ అహ్మద్, ఫూజ్ అహ్మద్, నవీద్ జద్రాన్. రిజర్వ్‌లు: దర్విష్ రసూలీ, బిలాల్ సామి

**ఇంగ్లాండ్:** జోస్ బట్లర్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, టామ్ బాంటన్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, బెన్ డకెట్, జామీ ఓవర్టన్, జామీ స్మిత్, లియామ్ లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, జో రూట్ , సాకిబ్ మహమూద్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్

**ఆస్ట్రేలియా:** స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కారీ , బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సర్ జాన్సన్, మార్నస్ లాబుస్చాగ్నే, గ్లెన్ మాక్స్‌వెల్ , తన్వీర్ సంఘ, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా . ట్రావెలింగ్ రిజర్వ్: కూపర్ కొన్నోలీ.

**దక్షిణాఫ్రికా:** టెంబా బావుమా (కెప్టెన్), టోనీ డి జోర్జి, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్ , కేశవ్ మహరాజ్ , ఐడెన్ మార్క్రామ్ , డేవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, లుంగి ఎన్గిడి , కగిసో రబడ , ర్యాన్ రికెల్టన్, తబ్రైజ్ షంబ్స్ , ట్రిస్టన్ స్టూబ్స్, ట్రిస్టన్ స్టబ్స్, కోర్డర్ ట్రావెలింగ్ రిజర్వ్: క్వేనా మఫాకా

# నెంబర్ 1 జట్టుగా ఛాంపియన్ ట్రోఫీలో అడుగు పెట్టనున్న టీమిండియా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్ లో టీమిండియా నెంబర్ వన్ స్థానానికి చేరుకుంది. దీంతో నెంబర్ వన్ జట్టుగా రోహిత్ సేన ఛాంపియన్స్ ట్రోఫీలో అడుగుపెట్టనుంది. ఇంగ్లాండ్ పై ఇటీవలే మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ను 3-0 తేడాతో గెలుచుకున్న తర్వాత భారత్ టాప్ ర్యాంక్ కు చేరుకుంది. ప్రస్తుతం టీమిండియా ఖాతాలో 119 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. మరోవైపు శ్రీలంకపై ఆస్ట్రేలియా 0-2 తేడాతో ఓడిపోయిన తర్వాత మూడవ స్థానం నుండి రెండవ స్థానానికి చేరుకోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. పాకిస్తాన్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా ఇటీవలే ముక్కోణపు సిరీస్ ఆడాయి. కివీస్ జట్టు టైటిల్‌ను గెలుచుకుని నాలుగో స్థానంలో నిలిచింది. మరోవైపు ఫైనల్లో ఓడిపోయిన పాకిస్థాన్ రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయింది. సౌతాఫ్రికా జట్టు ఐదో స్థానంలో ఉంది. ఇటీవలే వన్డేల్లో పేలవ ప్రదర్శన చేస్తున్న ఇంగ్లాండ్ ఏడో స్థానానికి దిగిపోయింది. స్వదేశంలో వరుస విజయాలు సాధిస్తున్న శ్రీలంక ఆరో స్థానంలో నిలిచింది. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్ వరుసగా 8,9,10 స్థానాల్లో నిలిచాయి. ప్రస్తుతం ఛాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించిన 8 జట్లు ఫిబ్రవరి 19 నుంచి ఈ మెగా టోర్నీ ఆడనున్నాయి. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ గ్రూప్ ఏ లో ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ గ్రూప్ బి లో ఉన్నాయి.శ్రీలంక, వెస్టిండీస్ ఈ మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోయాయి. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగనున్న ఈ మెగా టోర్నీ మొత్తం 20 రోజుల పాటు అభిమానులను అలరించనుంది. హైబ్రిడ్ మొదల్లో జరగనున్న ఈ టోర్నీకి పాకిస్థాన్, దుబాయ్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అన్ని జట్లతో పోల్చుకుంటే పటిష్టంగా కనిపిస్తున్న టీమిండియా టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది.

# కోహ్లీ, రోహిత్, జడేజాలకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ: భారత మాజీ క్రికెటర్




**హైదరాబాద్ పెన్ పవర్:** విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా భారత క్రికెట్ లో ప్రస్తుతం అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు. వీరి వయసు 35 దాటడం.. పెద్దగా ఫామ్ లో లేకపోవడంతో వీరి రిటైర్మెంట్ పై వార్తలు వస్తున్నాయి. ఈ సమయంలో భారత మాజీ క్రికెటర్.. ప్రముఖ కామెంటేటర్ ఆకాష్ చోప్రా ఈ త్రయంపై షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఫిబ్రవరి 19న ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలకు చివరి ఐసీసీ ఈవెంట్ అవుతుందని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. ఈ ముగ్గురు సీనియర్ ఆటగాళ్ళు 2027 వన్డే వరల్డ్ కప్ లో కనిపించకపోవచ్చని చోప్రా షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నాను. రోహిత్, కోహ్లీ, జడేజాలకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ అవుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఐసీసీ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరుగుతుంది. భారత్ ఫైనల్ కు క్వాలిఫై కాలేదు కాబట్టి ఆడలేదు. 2026 లో జరగబోయే టీ20 వరల్డ్ కప్ కు ఈ ముగ్గురు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆడే అవకాశం లేదు. 2027 వన్డే వరల్డ్ కప్ కు ఇంకా చాలా సమయం ఉంది. అప్పటివరకు వీరు ముగ్గురూ కొనసాగడం కష్టమే. 2027 నాటికి ప్రపంచం చాలా భిన్నంగా కనిపిస్తుంది. కాబట్టి ఇదే ఈ ముగ్గురికి చివరి ఐసీసీ టోర్నీ అని నేను భావిస్తున్నాను". అని చోప్రా అన్నారు. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ, జడేజా ముగ్గురూ వన్డే, టెస్ట్ ఫార్మాట్ ఆడుతున్నారు. ఇప్పటికీ రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ దగ్గర పడింది. వన్డేల్లోనూ ఎక్కువ కాలం కొనసాగే అవకాశాలు లేనట్టు కనిపిస్తున్నాయి. మరోవైపు కోహ్లీ పేలవ ఫామ్ తో ఇబ్బంది పడుతున్నాడు. గత నాలుగేళ్లలో వన్డే వరల్డ్ కప్ మినహాయిస్తే కోహ్లీ గొప్పగా ఆడిన మ్యాచ్ లు చాలా తక్కువ. పదే పదే విఫలమవుతూ జట్టుకు భారంగా మారుతున్నాడు. జడేజా రెండు ఫార్మాట్ లలో ఆల్ రౌండర్ గా రాణించాలంటే కష్టం. పైగా అక్షర్ పటేల్, సుందర్ అతనికి గట్టి పోటీనిస్తున్నారు. వీరు మరో ఐసీసీ టోర్నీ ఆడాలంటే 2027 వన్డే వరల్డ్ కప్ లోనే సాధ్యపడుతుంది. కానీ అప్పటివరకు వీరు కొనసాగడం ఆకాష్ చోప్రా చెప్పినట్టు నిజంగానే కష్టంగా కనిపిస్తుంది.



సిద్ధికా శర్మ ఫ్యాషన్ చాలా బాగుంది, ఇది నిర్వహించడా నికి చాలా వేడిగా ఉంది





మౌని రాయ్ యొక్క ఫ్యాషన్ ప్రభావం హృదయాలను ఆకర్షిస్తోంది

# 'విశ్వంభర'తో మెగా ఫ్యాన్స్‌లో అసహనం...!

మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం ఫ్యాన్స్‌తో పాటు రెగ్యులర్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విశ్వంభర సినిమాను గత ఏడాది ప్రారంభించిన సమయంలో 2025 సంక్రాంతికి ఖచ్చితంగా విడుదల చేస్తామనే ధీమా వ్యక్తం చేశారు. కానీ సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కానందున సినిమాను 2025 సమ్మర్‌లో విడుదల చేస్తామంటూ ప్రనకటించారు. కానీ ఇప్పటి వరకు విడుదలకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వడం లేదు. మే నెలలో సినిమాను విడుదల చేయాలని భావించినా సాధ్యం అయ్యేలా లేదు. ఇప్పటికే విశ్వంభర సినిమా షూటింగ్ పూర్తి అయిందనే వార్తలు వస్తున్నాయి.షూటింగ్ పూర్తి చేసి వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో మేకర్స్ కిందా మీదా పడుతున్నారు. విశ్వంభర టీజర్ వీఎఫ్ఎక్స్ విషయంలో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. అందుకే వీఎఫ్ఎక్స్ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో మేకర్స్ సమయం తీసుకుంటున్నారని తెలుస్తోంది. హాలీవుడ్ సినిమాలకు వర్క్ చేసిన వీఎఫ్ఎక్స్ టీంను ఈ సినిమా కోసం రంగంలోకి దించారట. బడ్జెట్ పెరగడంతో పాటు సమయం కూడా దాదాపు నాలుగు నుంచి ఆరు నెలలు అధికంగా పట్టే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దాంతో సినిమా మే నెలలో విడుదల కాకపోవచ్చు అంటున్నారు.విశ్వంభర సినిమాతో చిరంజీవి కచ్చితంగా ఒక పక్కా కమర్షియల్ సక్సెస్‌ను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని మెగా ఫ్యాన్స్‌తో పాటు అంతా నమ్మకంగా ఉన్నారు. బింబిసార సినిమాను డీసెంట్ హిట్ చేసిన దర్శకుడు వశిష్ట ఈ సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంటాడా అనేది చూడాలి. ప్రస్తుతం ఈ సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతుందని, త్వరలోనే సినిమా విడుదలకు సంబంధించిన డేట్‌ను ప్రకటిస్తామని ఆ మధ్య నిర్మాతలు చెప్పారు. కానీ ఇప్పటి వరకు విడుదల విషయంలో ఎలాంటి క్లారిటీ ఇవ్వక పోవడంతో ఫ్యాన్స్‌లో అసహనం మొదలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com